హైదరాబాద్ కెప్టెన్‌గా మోరెనో

• రగ్బీ ప్రీమియర్ లీగ్

ముంబై: ఆదివారం నుంచి ఆరంభమైన జీఎంఆర్ రగ్బీ ప్రీమియర్ లీగ్ (ఆర్‌బీఎల్)లో హైదరాబాద్ హీరోస్ ఫ్రాంచైజీకి స్పెయిన్ సూపర్ స్టార్ మాన్యుయెల్ మోరెనో సారథిగా నియమితుడయ్యాడు. అతడికి తోడుగా భారత ఆటగాడు ప్రిన్స్ ఖత్రి, జర్మనీ ప్లేయర్ మాక్స్ రాడిక్ వైస్ కెప్టెన్‌లుగా వ్యవహరించనున్నారు. ప్రపంచంలోనే మొట్టమొదటి ఫ్రాంచైజీ ఆధారిత అంతర్జాతీయ రగ్బీ లీగ్ అయిన ఆర్‌బీఎల్‌లో.. సుమారు 30 దేశాల నుంచి ఆటగాళ్లు పాల్గొంటున్నారు. ఆరు ఫ్రాంచైజీలు (బెంగళూరు బ్రేవ్‌హార్ట్స్, చెన్నై బుల్స్, ఢిల్లీ రెడ్జ్, హైదరాబాద్ హీరోస్, కలింగ బ్లాక్ టైగర్స్, ముంబై డ్రీమర్స్) తలపడుతున్న ఈ టోర్నీ ముంబైలోని అంధేరి స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆతిథ్యమిస్తున్నది. ఇక హైదరాబాద్ జట్టుకు సారథిగా ఎంపికవడంపై మోరెనో స్పందిస్తూ.. 'సారథిగా నియమితుడవడం పెద్ద బాధ్యత. దానిని నేను చాలా సీరియస్‌గా తీసుకుంటాను. ప్రిన్స్, మాక్స్‌తో కలిసి జట్టును విజేతగా నిలపడమే మా లక్ష్యం' అని అన్నాడు. కాగా తాము ఆడిన తొలి మ్యాచ్‌లో హైదరాబాద్.. 24-14తో కలింగ బ్లాక్ టైగర్స్‌పై విజయం సాధించి టోర్నీలో శుభారంభం చేసింది.

భారత్‌కు ఆరో ఓటమి

• ఆస్ట్రేలియా చేతిలో పరాభవం

బెల్జియం: ఎఫ్ఐహెచ్ యూరోపియన్ అంచెలో భారత హాకీ జట్టు అపజయాల పరంపర కొనసాగుతున్నది. ఆదివారం భారత జట్టు.. 2-3 తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. మాజీ సారథి మన్‌ప్రీత్ సింగ్ తన కెరీర్‌లో 400వ మ్యాచ్ ఆడినా అతడికి ఆ ఆనందం కూడా మిగల్లేదు. మ్యాచ్‌లో మూడో నిమిషంలోనే సంజయ్ తొలి గోల్ కొట్టి భారత్‌ను ఆధిక్యంలోకి తెచ్చాడు. కానీ ఆస్ట్రేలియా ఆటగాడు టిమ్ బ్రాండ్ (4వ ని.), బ్లేక్ గోవర్స్ (5వ ని.) రెండు నిమిషాల వ్యవధిలోనే రెండు గోల్స్ చేసి ఆధిపత్యాన్ని కొనసాగించారు. అదే ఊపులో కూపర్ బర్న్స్ (18వ ని.) మరో గోల్ కొట్టడంతో ఆ జట్టు 3-1 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆట 27వ నిమిషంలో వరుసగా రెండు పెనాల్టీ కార్నర్ అవకాశాలు వచ్చినా భారత్ వాటిని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమైంది. కానీ 36వ నిమిషంలో దిల్‌ప్రీత్ గోల్ కొట్టి ప్రత్యర్థి ఆధిక్యాన్ని తగ్గించాడు. అయితే ఆ తర్వాత భారత్.. గోల్ కొట్టకపోవడంతో ఓటమి తప్పలేదు. ఈనెల 21న భారత్.. బెల్జియంతో తలపడనుంది. మహిళల హాకీ జట్టు సైతం వరుస పరాభావాలతో సతమతమవుతున్నది. ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్.. 1-2తో ఆస్ట్రేలియా చేతిలోనే ఓడింది. మూడు రోజుల వ్యవధిలోనే ఆస్ట్రేలియా చేతిలో భారత్‌కు ఇది వరుసగా రెండో ఓటమి.

నిద్ర లేని రాత్రులు గడిపా: సిన్నర్

రోమ్: ఇటీవలే ముగిసిన ఫ్రెంచ్ ఓపెన్‌లో స్పెయిన్ సంచలనం కార్లొస్ అల్కరాజ్ చేతిలో ఓడటంతో నిద్రలేని రాత్రులను గడిపానని వరల్డ్ నెంబర్ వన్ యానిక్ సిన్నర్ (ఇటలీ) అన్నాడు. ఐదున్నర గంటలు, ఐదు సెట్ల పాటు హోరాహోరీగా సాగిన ఫైనల్‌లో అల్కరాజ్.. సిన్నర్‌పై అనూహ్య విజయం సాధించి ఫ్రెంచ్ ఓపెన్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను నిలబెట్టుకున్న విషయం విదితమే. ఇదే విషయమై తాజాగా సిన్నర్ మాట్లాడుతూ.. 'క్రీడాకారుల కెరీర్‌లో ప్రతి మ్యాచ్ ఒక కొత్త ఆరంభం. ఎవరైనా అందుకు మానసికంగా సిద్ధంగా ఉండాలి. అక్కడ (ఫ్రెంచ్ ఓపెన్) ఓటమి నన్ను కుంగదీసింది. కొన్ని నిద్రలేని రాత్రులను గడిపా. ఆ బాధను మరిచిపోవడానికి నా కుటుంబం, మిత్రులు నాకు అండగా నిలిచారు. ఇప్పటికీ నేను ఆ మ్యాచ్ గురించే ఆలోచిస్తున్నా..' అని తెలిపాడు. ఫ్రెంచ్ ఓపెన్ తర్వాత సిన్నర్.. జర్మనీలో జరుగుతున్న హాలే ఓపెన్‌లో ఆడుతున్నాడు.

డబ్ల్యూటీసీ 2025-27 సైకిల్‌కు ముహూర్తం

రేపటి నుంచే కొత్త సవాల్

శ్రీలంక, బంగ్లాదేశ్ టెస్టుతో ఆరంభం • ఇంగ్లండ్ సిరీస్‌తో వేట ప్రారంభించనున్న భారత్

దుబాయ్: దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా మధ్య రెండ్రోజుల క్రితమే లార్డ్స్‌లో జరిగిన ఐసీసీ వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ మ్యాచ్‌తో 2023-25 సైకిల్‌కు తెరపడింది. మూడో ఎడిషన్ విజేతగా దక్షిణాఫ్రికా నిలవగా.. ఫైనల్ ముగిసిన మూడు రోజులకే డబ్ల్యూటీసీ కొత్త సైకిల్ (2025-27) మొదలవనున్నది. ఈనెల 17 నుంచి శ్రీలంక.. స్వదేశంలో బంగ్లాదేశ్‌తో గాలె వేదికగా జరుగబోయే టెస్టుతో నాలుగో ఎడిషన్ మొదలవనుంది. 9 దేశాలు పాల్గొననున్న ఈ ఎడిషన్‌లో మొత్తం 71 టెస్టులు జరుగనున్నాయి. కొత్త సైకిల్‌లోనూ ఆస్ట్రేలియా అత్యధికంగా 22 టెస్టులు ఆడనుండగా మరో అగ్రశ్రేణి జట్టైన ఇంగ్లండ్ 21 టెస్టులు ఆడనుంది. వరుసగా రెండుసార్లు రన్నరప్‌గా నిలిచిన భారత జట్టు.. 18 టెస్టులు ఆడుతుంది. రోహిత్ శర్మ తప్పుకోవడంతో కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని టీమ్‌ఇండియా.. ఈనెల 20 నుంచి ఇంగ్లండ్‌తో మొదలుకాబోయే ఐదు మ్యాచ్‌ల సిరీస్‌తో డబ్ల్యూటీసీ 2025-27 టైటిల్ వేటను ఆరంభించనుంది. నాలుగో ఎడిషన్‌లో ఒక్కో జట్టు ఆరు సిరీస్‌లు (స్వదేశంలో 3, విదేశాల్లో 3) ఆడనుంది.

భారత షెడ్యూల్

గత ఎడిషన్‌తో పోల్చితే ఒక మ్యాచ్ తక్కువగా ఆడనున్న భారత జట్టు.. స్వదేశంలో 9, విదేశాల్లో 9 టెస్టులు ఆడనున్నది. సొంతగడ్డపై వెస్టిండీస్, దక్షిణాఫ్రికాతో తలా రెండు మ్యాచ్‌లు ఆడనున్న మెన్ ఇన్ బ్లూ.. వచ్చే ఏడాది ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల సిరీస్‌లో తలపడనుంది. విదేశాల్లో ఇంగ్లండ్‌తో ఐదు.. శ్రీలంక, న్యూజిలాండ్‌తో తలా రెండు టెస్టులు ఆడుతుంది.

టెస్టు క్రికెట్‌ను ప్రోత్సహించేందుకు గాను ఐసీసీ నిర్వహిస్తున్న డబ్ల్యూటీసీ చాంపియన్‌షిప్స్ కొత్త ఎడిషన్‌లో కొన్ని హైప్రొఫైల్ మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లండ్ మధ్య జరిగే యాషెస్ సిరీస్‌కు తోడు భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగే బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ, సౌతాఫ్రికా-ఆస్ట్రేలియా మధ్య జరుగబోయే మ్యాచ్‌లు అభిమానులను అలరించనున్నాయి. ఇక మూడో ఎడిషన్ విజేత అయిన దక్షిణాఫ్రికా.. ఈ ఏడాది అక్టోబర్‌లో పాకిస్థాన్‌తో జరుగబోయే టెస్టులతో తమ ప్రయాణాన్ని మొదలుపెట్టనుంది. గత ఎడిషన్‌లో 12 మ్యాచ్‌లే ఆడిన సఫారీలు.. నాలుగో ఎడిషన్‌లో 14 మ్యాచ్‌లు ఆడనున్నారు.

విండీస్ రికార్డు స్కోరు

బ్రెడీ: ఐర్లాండ్ పర్యటనలో ఉన్న వెస్టిండీస్.. ఆతిథ్య జట్టుతో జరిగిన మూడో టీ20లో అదరగొట్టింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు వచ్చిన విండీస్.. నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 256 పరుగులు చేసింది. కరీబియన్ ఓపెనర్ ఎవిన్ లూయిస్ (44 బంతుల్లో 91, 7 ఫోర్లు, 8 సిక్సర్లు), కెప్టెన్ షై హోప్ (27 బంతుల్లో 51, 4 ఫోర్లు, 4 సిక్సర్లు) వీర విధ్వంసానికి తోడు ఆఖర్లో కార్టీ (22 బంతుల్లో 49 నాటౌట్, 4 ఫోర్లు, 4 సిక్సర్లు) మెరుపులు మెరిపించారు. పొట్టి క్రికెట్‌లో వెస్టిండీస్‌కు ఇది రెండో అత్యధిక స్కోరు. గతంలో ఆ జట్టు సౌతాఫ్రికాపై 258/5 పరుగులు చేసింది. ఇక ఛేదనలో ఐర్లాండ్.. 20 ఓవర్లలో 194/7 వద్దే ఆగిపోవడంతో విండీస్ 62 పరుగుల తేడాతో గెలిచింది.

ఆస్ట్రేలియా మాపై స్లెడ్జింగ్ చేసింది!

• బవుమా ఆరోపణ

లండన్: డబ్ల్యూటీసీ ఫైనల్‌లో దక్షిణాఫ్రికా ఏకాగ్రతను దెబ్బతీసేందుకు ఆస్ట్రేలియా తనకు అచ్చొచ్చిన 'స్లెడ్జింగ్'నే నమ్ముకున్నది. ఈ విషయాన్ని స్వయంగా సఫారీ సారథి బవుమానే వెల్లడించాడు. మార్క్‌రమ్-బవుమా జోడీ దక్షిణాఫ్రికా విజయాన్ని ఖరారు చేస్తున్న సమయంలో ఇక చేసేదేమీ లేక కంగారూలు తమకు వెన్నెతో పెట్టిన విద్య అయిన స్లెడ్జింగ్‌కు దిగారని అతడు ఆరోపించాడు. మ్యాచ్ అనంతరం బవుమా మాట్లాడుతూ.. 'మేం బ్యాటింగ్ చేస్తున్నప్పుడు ఆ భయంకరమైన పదాన్ని (చోకర్స్) విన్నాం. మేం ఇక్కడికి (లార్డ్స్‌కు) ఎంతో నమ్మకంతో వచ్చాం. మాపై ఎన్నో సందేహాలు. కానీ మా ఆటతీరు, ఈ గెలుపు వాటన్నంటినీ పటాపంచలు చేసింది. ఇది మా దేశానికి ఎంతో స్ఫూర్తిని స్తుందని నేను ఆశిస్తున్నా' అని అన్నాడు. దక్షిణాఫ్రికా సారథిగా ఉండటం అత్యంత సవాల్‌తో కూడుకున్నదని అతడు అన్నాడు. 'దక్షిణాఫ్రికా జట్టుకు సారథిగా ఉండటం అంత సులభం కాదు. ఎన్నో త్యాగాలు, ఎంతో నిరాశ అలుముకున్న సందర్భంలో మేం ఐసీసీ ట్రోఫీ గెలవడానికి అర్హులమని అనిపించింది' అని తెలిపాడు. ఈ విజయంతో తాను జట్టులో ఒక నల్లజాతి క్రికెటర్‌గానే కాకుండా అంతకుమించిన గుర్తింపును దక్కించుకున్నానని బవుమా భావోద్వేగంగా మాట్లాడాడు.

చరిత్ర సృష్టించిన యాజిక్

ఢిల్లీ: ఈశాన్య రాష్ట్రమైన అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన భారత యువ అథ్లెట్ హిల్లాంగ్ యాజిక్ చరిత్ర సృష్టించింది. భూటాన్ వేదికగా జరిగిన దక్షిణాసియా బాడీ బిల్డింగ్ అండ్ ఫిజిక్ స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో 25 ఏండ్ల యాజిక్ స్వర్ణంతో పాటు రజతం సాధించింది. ఈ క్రమంలో ఆమె అంతర్జాతీయ స్థాయిలో స్వర్ణం గెలిచిన తొలి అరుణాచల్ ప్రదేశ్ అథ్లెట్‌గా రికార్డులకెక్కింది. యాజిక్‌ను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఫెమా ఖండు, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రశంసల్లో ముంచెత్తారు.

యూటీటీ విజేత ముంబై

• ఫైనల్‌లో జైపూర్‌పై జయకేతనం

అహ్మదాబాద్: ప్రతిష్టాత్మక అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ) ఆరో సీజన్‌లో యూ ముంబా జట్టు విజేతగా నిలిచింది. గత మూడు వారాలుగా క్రీడాభిమానులను అలరించిన ఈ టోర్నీ ఫైనల్‌లో యూ ముంబా జట్టు.. 8-4తో జైపూర్ పాట్రియాట్స్‌పై ఘన విజయం సాధించి టైటిల్‌ను ఎగురేసుకుపోయింది. అహ్మదాబాద్‌లోని ఎకా ఎరీనా వేదికగా జరిగిన పురుషుల సింగిల్స్‌లో యూ ముంబా ఆటగాడు లిలియన్ బార్డెట్ 2-1 (4-11, 11-5, 11-7)తో కనక్ ఝూను ఓడించగా మహిళల సింగిల్స్‌లో బెర్నడెట్.. 2-1 (11-9, 10-11, 11-5)తో ఆకుల శ్రీజపై గెలిచింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ముంబై ద్వయం ఆకాశ్, బెర్నడెట్.. 3-0 (11-6చ 11-5, 11-5)తో జీత్ చంద్ర, బ్రిట్ ఎర్లండ్‌ను ఓడించి టైటిల్‌ను ఖాయం చేసుకుంది. చివరి మ్యాచ్‌లో అభినానంద్ 1-2 (5-11, 8-11, 11-8)తో జీత్ చంద్ర చేతిలో ఓడాడు. యూటీటీలో ముంబై జట్టుకు ఇదే తొలి ట్రోఫీ కావడం విశేషం.

శార్దూల్, సర్ఫరాజ్ శతకాలు

లండన్: ఇంగ్లండ్‌తో ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు ముందు భారత జట్టు తమలో తాము ఆడిన ఇంట్రా స్క్వాడ్ మ్యాచ్‌ను మూడు రోజుల్లో ముగించింది. కెంట్ వేదికగా ఆదివారం ముగిసిన మ్యాచ్‌లో భారత ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్ (122 నాటౌట్)తో పాటు ఇంగ్లండ్‌తో జట్టుకు ఎంపిక కాని సర్ఫరాజ్ ఖాన్ (101) శతకాలతో మెరిశారు. చాలాకాలంగా జట్టుకు దూరమైన శార్దూల్.. ఇటీవలే ఇంగ్లండ్ 'ఏ'తో జరిగిన ప్రాక్టీస్ మ్యాచ్‌లోనూ ఫర్వాలేదనిపించగా తాజాగా సెంచరీతో కదంతొక్కడంతో అతడు ఈ నెల 20 నుంచి లీడ్స్ వేదికగా మొదలుకాబోయే తొలి టెస్టులో చోటు దక్కించుకునే అవకాశాలను మెరుగుపరుచుకున్నాడు.

SR TRANSFORMS ASPIRANTS INTO ACHIEVERS IN NEET 2025

All INDIA RANK

14
P.SAI DIVYAN
APP. 250410515682 (R)

All INDIA RANK

100
B.PRIYANKA
APP. 250411126499 (R)

All INDIA RANK

226
M.VINAY
APP. 250410494057 (R)

NEET 2025 MARKS BASED CONCESSIONS

NEET-2025 MARKS	CONCESSION
> 360	90%
350 to 359	80%
340 to 349	70%
330 to 339	60%
320 to 329	50%
310 to 319	40%
300 to 309	30%

IPE 2025 MARKS BASED CONCESSIONS

IPE-2025 MARKS	CONCESSION
> 980	70%
960 to 979	60%
900 to 959	50%

NOTE: * The ABOVE CONCESSIONS APPLICABLE FOR LIMITED PERIOD AND LIMITED ADMISSION ONLY.

తెలుగు రాష్ట్రాల్లో పెరుగుతున్న మెడికల్ సీట్స్ ను దృష్టిలో ఉంచుకొని డాక్టర్ కావాలనే ప్రతి విద్యార్థి కల ను నెరవేర్చుటకై IPE/NEET 2025 మార్కుల ఆధారంగా NEET లాంగ్ టర్మ్ అడ్మిషన్స్‌లో రాయితీలపై 'SR' సంచలనాత్మక నిర్ణయం.

LONG TERM 'NEET' COACHING CLASSES STARTS FROM 2nd JULY 2025

HYDERABAD: 8886322296, 9121307474, 9290684090, 8712612424, 8712612422, 8712604778, 8712612435, 8712612425, 8712612433, 8712021666 | WARANGAL: 9642117378, 9154989356 | VIJAYAWADA: 8142111302 | VIZAG: 9052222274, 9154854707 | GUNTUR: 9154854694 | TIRUPATI: 9154854699 | NELLORE: 9154854696 | ANANTHAPURM: 9154854691 | KURNOOL: 9154854695 | NIZAMABAD: 9642117110, 096421 15777 | SRIKAKULAM: 9154854697 | BHIMAVARAM: 9642223762, 7331122579 | RAJAHMUNDRY: 9154854693 | KARIMNAGAR: 9642117335 | NALGONDA: 9573927070 | ONGOLE: 8712609156 | KHAMMAM: 9121155002 | ADILABAD: 9154854690 | KOTHAGUDEM: 9154854692 | NIRMAL: 9642117835 | HOSAPETE: 9154854713.

SR Educational Academy
TELANGANA • ANDHRA PRADESH • KARNATAKA